ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 7 జూలై 2024

బొగ్గు బ్లాకుల వేలం ఆపేదాకా పోరాటం - మాజీ ఎమ్మెల్యే చందర్ 8లో..

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి.. 8లో..

రామగుండం కార్పొరేషన్‌పై కలెక్టర్ నజర్

- పరిపాలనలో ప్రక్షాళనకు శ్రీకారం - వారంలో ఒక రోజు కార్యాలయంలోనే సమీక్ష - గత వారం ఆర్‌అండ్‌బీ ఏఈపై, ఇప్పుడు ఇద్దరు సిబ్బందిపై వేటు..

కోల్‌సిటీ, జూలై 6: అవినీతికి, నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా మారిన రామగుండం కార్పొరేషన్‌పై కలెక్టర్ శ్రీహర్ష నజర్ పెట్టారు. జిల్లాలో ఏకైక కార్పొరేషన్ అయిన రామగుండంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు సింగరేణి, జెన్‌కో వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఉన్నాయి. రామగుండం నగర పాలన కొన్నేళ్లుగా అస్తవ్యస్తంగా ఉంది. ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు పూర్తిగా అవినీతి మయమయ్యాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఆడింది ఆటగా సాగుతోంది. జరగని పనులను జరిగినట్టు రికార్డులు చేయడం, ఓచర్ బిల్లుల పేర కోట్ల రూపాయలు స్వాహా చేయడం పరిపాటి అయ్యింది. కాంట్రాక్టర్లే తమకు ఇష్టం వచ్చినట్టు ఎంబీ రికార్డులు రాసుకుని వస్తే సంతకాలు పెట్టే సంస్కృతి రామగుండంలో నెలకొన్నది. టెండర్ నిబంధనలు మార్చి అనునాయులకు టెండర్లు ఇప్పించడం మొదలు అంచనాలు ఒకటి ఉంటే పని మరొకటి చేయించడం, సీసీ రోడ్లలో పీసీసీలు వేసి సీసీలు వేయకుండా బిల్లులు రికార్డు చేసుకోవడం, యూజీడీలో నాసికరకం పైపులు, మెటీరియల్ వాడకం వంటివి నిత్యకృత్యాలు.



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

● అవినీతి అధికారుల్లో గుబులు

ఇంజనీరింగ్ శాఖ అలసత్వానికి 14వ ఆర్థిక సంఘం, ఎస్‌సీ సబ్‌ప్లాన్ వంటి గ్రాంట్లకు సంబంధించిన పనులు కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. ఒక్కో కాంట్రాక్టర్ చేతుల్లో పది వరకు పనులున్నా పనులు ప్రారంభించని పరిస్థితులు ఉన్నాయి. పారిశుధ్య విభాగంలో పరిస్థితులు మరింత దిగజారాయి. డీజిల్ కుంభకోణం, బ్లీచింగ్ పౌడర్, ఇతర మెటీరియళ్ల కొనుగోళ్లలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. రెవెన్యూ విభాగంలో గతంలో ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు ఇవ్వడంతో వివాదాలు మొదలయ్యాయి. ఇప్పటికీ ఆ ఇంటి నంబర్లు రద్దు అయిన పరిస్థితి లేదు. కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరు అయిన ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లలో పూర్తి నిర్లక్ష్యం ఉంది. ఏటా రూ.3కోట్ల నుంచి రూ.4 కోట్ల డిమాండ్ ఉండే ట్రేడ్ లైసెన్స్‌ల డిమాండ్లలో రూ.30లక్షల నుంచి రూ.40లక్షలతోనే సరిపెడుతున్నారు. రైస్‌మిల్లులు, ఫంక్షన్‌హాల్స్, మద్యం షాపులు, వర్క్‌షాప్‌లు, తదితర వ్యాపారాల వసూళ్లు లేవు. కార్పొరేషన్ కనీస సేవలైన పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరాలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఈ పరిస్థితుల్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండం కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. వారంలో ఒకరోజు కార్పొరేషన్‌లో పర్యటించడమే కాకుండా విభాగాల వారీగా సమీక్ష చేస్తున్నారు. అధికారులు, సిబ్బందికి టార్గెట్లు పెడుతున్నారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు వేస్తున్నారు.

గతవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నిర్లక్ష్యం వహించాడని ఆర్‌అండ్‌బీ ఏఈని సస్పెండ్ చేయగా, శనివారం కార్పొరేషన్ బిల్ కలెక్టర్ సతీష్‌ను సస్పెండ్ చేశారు. మరో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌ను సరెండర్ చేశారు. కలెక్టర్ ఎప్పుడు, ఏవిధంగా స్పందిస్తారో, ఎవరిపై వేటు పడుతుందోననే ఆందోళన ఇప్పుడు అవినీతి అధికారుల్లో వ్యక్తమవుతోంది.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ బి రవీందర్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి రవీందర్ నాయక్

పెద్దపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ బి రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం జిల్లాలోని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఒక సమగ్ర కార్యాచరణ రూపొందించి, దాని ప్రకారం చర్యలు చేపట్టాలని, అన్ని రకాల మందులు ఆరోగ్య కేంద్రాలలో నిల్వ ఉంచుకోవాలని, ఎమర్జెన్సీలో సేవలు అందించుటకు రాపిడ్‌రెస్పాన్స్ టీంలను జిల్లా, మండలాల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. హైరిస్క్ ఏరియాలను గుర్తించి ప్రత్యేకంగా సీజనల్ డిసీజ్ నివారణకు ప్రత్యేక చర్యలు ఇతర శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ మాట్లాడుతూ జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, డీపీవో ఆశాలత, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకాంత్, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్రమిత వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.ప్రమోద్ కుమార్

పెద్దపల్లిటౌన్, జూలై 6: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కె.ప్రమోద్‌కుమార్ ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లిలోని పశు వైద్యశాలలో నిర్వహించిన జంతువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ రామస్వామి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కమలాకర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.మధూకర్‌రెడ్డి, హెచ్‌ఈవో టీ. రాజేశం, ఎపిడమలాజిస్ట్ నరేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే మండిపాటు

- 23వ డివిజన్‌లో ఎమ్మెల్యే 'పట్టణ బాట'



పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్, జులై 6 : రామగుండం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. శనివారం పట్టణ బాటలో భాగంగా 23వ డివిజన్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మున్సిపల్, ఎన్టీపీసీ అధికారులతో కల్సి పర్యటించారు. డివిజన్ పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త, కూరుకుపోయిన నాలాను ఎందుకు సరిచేయడం లేదని నిలదీశారు. తక్షణం పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. కాలనీలో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇప్పించాలని తహసీల్దార్‌ను కోరారు. లుకలయ్య గుడి వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై పరిష్కారం చూపించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, మేయర్ అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసిల్దార్ కుమారస్వామి, ఎన్టీపీసీ ఏజీఎం సిక్దర్, మున్సిపల్, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

మంథని, జూలై 6: మంథని మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, దుస్తులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెంద్రి రమ సురేష్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, పాలకవర్గ సభ్యులు గుండా విజయలక్ష్మి-పాపారావు, కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర-శంకర్, కొట్టె పద్మ-రమేష్, వీకే రవి, వేముల లక్ష్మిసమ్మయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెన్షన్‌కు గురైన అధికారులను విధుల్లోకి తీసుకోవాలి

పెద్దపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఆడిట్ అధికారి సురేష్‌బాబు, జిల్లా భూగర్భ జల అధికారి రవి శంకర్‌ల సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ శనివారం కలెక్టర్ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆయనతోపాటు టీజీవో జిల్లా నాయకులు కరుణాకర్, విజయపాల్‌రెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సాజిద్ తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

- రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి ప్లాన్లు సమర్పించండి - సమీక్ష సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీ, జూలై 6: రామగుండం నగరపాలక సంస్థలో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా పని తీరు, అభివృద్ధి పనులు, పారిశుధ్య చర్యలు, రెవెన్యూ వసూళ్లు, అక్రమ కట్టడాలు తదితర విషయాలపై విడివిడిగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం ఇంజనీరింగ్‌లో మూసవిధానాన్ని విడనాడాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు, స్ట్రోమ్ వాటర్ డ్రైన్లు ఏ డివిజన్‌లో ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్మిస్తున్నది పూర్తి సమాచారంతో డ్రాయింగ్‌లు సమర్పించాలన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను టెండర్లు పూర్తికాగానే అగ్రిమెంట్లు చేసి ప్రారంభించాలన్నారు. డీఎంఎఫ్‌టీకి సంబంధించి సవివరమైన ప్రతిపాదనలు చేయాలన్నారు. పట్టణ ప్రగతి, ఏసీడీపీ, ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 20వ తేదీ నాటికి జంక్షన్ల డెవలప్‌మెంట్ పనులు ప్రారంభంకావాలని, నగరంలో మీడియన్ నిర్మాణం, సెంట్రల్‌లైటింగ్, రోడ్ల విస్తరణ, తాగునీటి పైప్‌లైన్ల పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. స్లాటర్‌హౌస్ రీమోడలింగ్, ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్, అప్రోచ్‌రోడ్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలువాలన్నారు. గోదావరిఖనిలో గోశాల వెనుక వైపు రూ.4 కోట్లతో నిర్మించిన ఫ్రూట్ మార్కెట్‌కు తుది ప్రణాళికలు ఇవ్వాలన్నా రు. అమృత్ నిధులతో చేపట్టనున్న ఎస్‌టీపీల పనులు పది రోజుల్లో ప్రారంభించాలని, ఇందుకు సంబంధించి ఏజెన్సీలను సిద్ధం చేయాలని ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. రామగుండంలో ఎక్కడ చూసినా చెత్త కనబడుతోందని, ప్రతిరోజు వార్డు అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. టీఎస్ బీపాస్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత 2023 నుంచి నగరంలో జరిగిన అక్రమనిర్మాణాల జాబితా రెండురోజుల్లో అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని, పురపాలక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. నగరంలో నగరపాలక సంస్థకు చెందిన స్థలాలు, లేఅవుట్‌లోని స్థలాలు, ప్రభుత్వ భూములను పదిరోజుల్లో గుర్తించి కార్పొరేషన్‌కు చెందిన స్థలాలుగా బోర్డులు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. నగరంలో నూతన లేఅవుట్ల అనుమతులు నిబంధనల ప్రకారం అందించాలని, కార్పొరేషన్‌కు కేటాయించిన ఓపెన్ ప్రదేశాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ వసూళ్లపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పన్నుల వసూళ్లలో పురోగతి లేదని, దీనిపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ బ్యాంకు ఖాతాలో ఉన్న నిధులు, బిల్లుల చెల్లింపులపై కమిషనర్‌తో చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో ఇద్దరి సిబ్బందిపై వేటు

రామగుండం కార్పొరేషన్‌లో సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్ కోయ శ్రీహర్ష సీరియస్ అయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పారిశుధ్య పర్యవేక్షణలో విఫలమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌ను మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండ్ చేశారు. దీర్ఘకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజర్ అవుతున్న బిల్ కలెక్టర్ ఆర్ సతీష్‌ను సస్పెండ్ చేశారు.

మొక్కలు నాటడం, సంరక్షించడం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సుల్తానాబాద్, జూలై 6: వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటడం, సంరక్షించడం అందరి బాధ్యతని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వనమహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పెరికెగిద్ద ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీతో పాటు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతు వన మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, కౌన్సిలర్ చింతల సునిత రాజు, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య తది తరులు ఉన్నారు.

అంతర్గాం, జూలై 6: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు ఎమ్మెల్యే నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు, మాజీ ఎంపీపీ దుర్గం విజయ, ఎంపీ డీవో అలీం, సారేదార్ రహ్మతుల్లా, కాంగ్రెస్ నాయకులు పెండ్యాల మహేష్, ఆవుల గోపా ల్‌యాదవ్, బొడ్డు లింగమూర్తి, గజ్జెల నాగ రాజు, పూదరి సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, జూలై 7: నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బా ధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టువంటి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రగతినగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సతీష్, సిబ్బంది వార్డ్‌ఆఫీసర్ రాజు, ఆర్పీ మల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూలై 6: జిల్లాలో ఉన్న పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల అభివృద్ధి, పారిశుధ్యంపై అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా పెద్దపల్లి పట్టణానికి మంజూరుచేసిన 42 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 32 కోట్లతో చేపట్టే జంక్షన్ల అభివృద్ధి, మార్కెట్, వైకుంఠధామం, కమర్షియల్ బ్లాక్ నిర్మాణ పనుల ప్రణాళికను స్థానిక ఎమ్మెల్యేతో కలిసి సిద్ధం చేయాలని, మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకుని ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుంటూ తుది ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్లు మొదలగు పనుల టెండర్ ప్రక్రియ జూలై 10నాటికి పూర్తిచేసి 20నాటికి పనులు ప్రారంభించాలని, పనులు త్వరగా ప్రారంభం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధిపై సమీక్షించారు. పెండింగ్ పనుల టెండర్లు పూర్తిచేసి జులై 20 నాటికి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ ఆర్‌పిలు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాలు



మొక్క నాటుతున్న ఎస్ కుమార్

కళ్యాణ్‌నగర్, జూలై 6: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం గోదావరిఖనిలోని పలు బూత్‌ల్లో బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించిన గొప్ప మహనీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు గుండబోయిన భూమయ్య, కోడూరి రమేష్, కందుల పోషం, పిడుగు కృష్ణ, ఉపేందర్, సురేష్, పంగ రవి, బండారి శ్యాం, మామిడి వీరేశం, గుర్రం సురేష్, అందె రాజ్‌కుమార్, విశ్వనాథ్, శివరాం, పృథ్వీరాజ్, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూలై 6 : శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని శనివారం మండలంలోని చీకురాయిలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రామగిరి, జూలై 6: మండలంలోని సెంటినరీకాలనీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకను బీజేపీ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు మోల్గూరి శ్రీనివాస్, ధీర జీకృష్ణ, కందుల రమేశ్, శివ, అరుణ్, కాంగ్రెస్ నాయకులు తోట చంద్రయ్య, కాటం సత్యం, చిందం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, జూలై 6 : మండలకేంద్రంలోని బస్టాండ్ ఏరియాలో శనివారం శ్యామ ప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుడిపాటి సంతోష్‌రెడ్డి, పెంట లచ్చయ్య, మెండె రాజన్న, దాడి రవి, భూసారపు రవిందర్‌గౌడ్, నాడెం రాజయ్య, వజ్రారెడ్డి, బొజ్జ రమేష్, కొమ్మ మహేందర్, చొప్పరి సంతోష్, మద న్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

పెద్దపల్లిటౌన్, జూలై 6: నలభై ఏళ్ళుగా ఐసీడీఎస్‌లో సేవలందిస్తున్న 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం అంగన్‌వాడీ టీచర్‌కు రెండు లక్షలు, ఆయాకు లక్ష రూపాయలు చెల్లించాలని, పెన్షన్ నగదును పెంచాలని, జీవో నంబర్ 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జి జ్యోతి, నాయకులు శాంతాబాయి, ఎస్ రామలక్ష్మి, సుభాషిణి, నిర్మల, లక్ష్మి, షరీఫా, బాణమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన డ్రైనేజీ

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జమ్మికుంట, జూలై 6: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి పాత కూరగాయాల మార్కెట్ వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు ఇరుకుగా మారడంతో అటువైపు వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.. ఎఫ్‌సీఐ, నూతన వ్యవసాయ మార్కెట్, రైస్ మిల్లులకు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అధిక లోడుతో వచ్చే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వెళ్లే ట్రాలీలు, ఇసుక ట్రాక్టర్ల రాక పోకలతో రోడ్డు మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వీటికి తోడు చికెన్ సెంటర్లు, ఎగ్ సెంటర్లు, కిరాణ షాపులు అటువైపు ఎక్కువగా ఉన్నాయి. కోరపల్లి, విలాసాగర్, బిజిగిరిషరీఫ్, పోతిరెడ్డిపల్లి, కొండపాక గ్రామాలకు ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణంగానే కూరగాయాల మార్కెట్ రోడ్డు ఇరుకుగా ఉటుంది. దీనికితోడు కాల్వ ధ్వంసం కావడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో ధ్వంసమైన డ్రైనేజీ

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

- జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ

హుజూరాబాద్, జూలై 6: విద్యార్థులు నేరాల వైపుకి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని హుజూరాబాద్ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నూతన శిక్ష చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి పద్మ సాయిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవలే నూతనంగా వచ్చిన శిక్ష చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. యువత లక్ష్యం ఏర్పారుచుకొని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, మహిళ సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీలత, ఫైనాన్షియల్ లిట్రసి రోహిణి, సఖి లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు


గునుకుల కొండాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు పనులు

గన్నేరువరం, జూలై 6: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు 71 కోట్ల రూపాయలతో మంజూరైన డబుల్ రోడ్డు పనులు ఎట్టకేలకు కొన సాగుతున్నాయి. మొత్తం 21కిలోమీటర్ల మేర 33పీట్ల తారు రోడ్డు వేయనున్నారు. ప్రస్తుతం గునుకుల కొండాపూర్ వరకు వరకు రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. గన్నేరువరం మండలంగా ఏర్పాటు కాకముందు ఈ రో డ్డుపై వాహనాలు పెద్దగా వెళ్లేవి కావు. ప్రస్తుతం మండలంగా ఏర్పడ్డ గన్నేరువరం నుంచి వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇటీవలి వరకు రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనదా రులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు.

కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

రామడుగు, జూలై 6: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పల్లె ప్రకృతి వనంలోని ఫెన్సింగ్‌ను తొలగించారని తెలిపారు. తిరిగి శనివారం గ్రామపంచాయతీ సిబ్బందితో కంచెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటిన చోటే మళ్లీ గుంతలు

- మొక్కలు పెట్టి సంరక్షణ మరిచిన అధికారులు


చిగురుమామిడి గ్రామ శివారులో తీసిన గుంతలు

చిగురుమామిడి, జూలై 6: మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ఈ ఏడాది మళ్లీ ఆ ప్రాంతాల్లోనే మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న పామ్‌బండ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అట్టహాసంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015 ఆగస్టులో మొక్కలు నాటారు. అధికారులు పట్టించుకోక పోవడంతో అన్ని మొక్కలు ఎండి పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు ప్రజల సొమ్ము వృథా అయిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది మళ్లీ అధికారులు విధించిన లక్ష్యం చేరుకునేందుకు ఆ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 53,900 మొక్కలు నాటాల్సి ఉంది.. దీని కోసం అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత గుంతలు తీసి సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటి సంరక్షణకు కంచేలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి

జమ్మికుంట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. ప్రిన్సిపాల్‌గా జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజు రోజుకు పెరిగిపోతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మ్యాజిక్ ఫిగర్ రాలేదన్నారు. 400సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించి 240సీట్లకు పరిమితం చేశారని చెప్పారు.. ఎన్డీఏ పక్షాలను కలుపుకొని నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. ఇది పూర్తి కాలం నిలబడే ప్రభుత్వం కాదన్నారు. బీజేపీ ఒంటెత్తు పోకడలను మిత్ర పక్షాలు భరించలేక ఏ క్షణంలో అయిన వైదొలిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని, నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 200బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని తెలిపారు. సమావేశంలో వెలమరెడ్డి రాజిరెడ్డి, కొప్పుల శంకర్, బాసిర సందప్‌రావు, దండిగారి సతీష్, చెల్పూరి రాములు, వడ్లూరి కిషోర్, రాజు, వసుదేవ్, రమేశ్, రాజకుమారి, మధునయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

జమ్మికుంట, జూలై 6: సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సామాజిక శాస్త్రాల జ్ఞానశాస్త్రం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం పుట్టుక, స్వభావం, పరిమతులు, వాస్తవాలు, విలువలకు మధ్య ఉండే వైరుధ్యాలు, సామాజిక శాస్త్రాల పాత్ర అంశాలపై వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవం ద్వారా సమాజానికి పరిచయం అయ్యాయన్నారు. సామాజిక శాస్త్రాలు విలువలకు ప్రాధాన్యం ఇస్తే, సైన్స్ వాస్తావాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇవి ఎప్పుడు మారుతుంటాయని, అందుకే సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయవల్సిన అవసరం ఉందని చెప్పారు.. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రామమోహన్‌రావు, అధ్యాపకులు బి మహేందర్‌రావు, డాక్టర్ టి శ్రీలత, పిడి సుజాత, ఆర్ ఈశ్వరయ్య, వి స్వరూపరాణి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ రవి ప్రకాష్, డాక్టర్ సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని ఎన్‌ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వేణు వినోద్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన క్వాలిటి ఎం హాన్సమెంట్ ఇన్ టెక్నికల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ప్రయోగాలు చేసేలా అధ్యాపకులు తర్ఫీదులు చేయాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక జర్నల్స్‌లో మంచి నాణ్యమైన పరిశోధన పత్రాలు సమర్పించాలని, అప్పుడే మాత్రమే విద్యార్థులకు సరైన ఆదునిక పరిజ్ఞానం అందు ుందన్నారు. ప్రశ్నపత్రం తయారిలో, ముల్యాం కనంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసి డీన్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట రూరల్, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి విష్ణు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం పథకానికి నిధులు కేటాయించి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఉపాధ్యాయ, అటెండర్, స్కావెంజర్, పీటీ, టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇల్లందుల శ్రీనాథ్, మొలుగూరి వినయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి

చిగురుమామిడి, జూలై 6: మండలంలోని 17 గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతీ రోజు సుమారు 80 నుంచి 90 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తు న్న పరిస్థితి నెలకొంది. పలు గ్రామల్లో ప్రజలు దగ్గు, జ్వరం, జలుబుతో ఇబ్బందులు పడు తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండా సిబ్బంది కేవలం మందులు ఇస్తూ సరిపెడుతున్నారని పలువురు వాపోయారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి..

వైద్యాధికారులు సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ అదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో ఉండి చికిత్స అందించాలి.

- సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జూలై 6: ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ శనివారం విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రూ. 31.81లక్షల సైబర్ మోసం

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో రూ. 31.81లక్షలు సైబర్ మోసానికి గురైనట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫోన్‌చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరిసిల్లలో క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ పేరిట రూ.2.62లక్షలు, వేములవాడ టౌన్‌లోనూ ట్రేడింగ్ పేరిట రూ.28.75లక్షలు, ముస్తాబాద్‌లో ద్విచక్రవాహనం తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి రూ.44, 500 కాజేశారని వివరించారు. ప్రజలు మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

గోదావరిఖనిలో పోలీసుల తనిఖీలు

● మత్తు పదార్థాల కట్టడికి నార్కోటిక్ శిక్షణ డాగ్స్ వినియోగం




డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, జూలై 6: గోదావరిఖని ఇందిరానగర్‌లో శనివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిం చారు. ఏసీపీ ఎంరమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది కాలనీలోని ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొదటి సారిగా నార్కోటిక్ డాగ్స్‌ను వినియోగించారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి జాడ తెలుసుకునేందుకు వీటిని వినియోగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్థులు కాలనీల్లో షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, 100నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి గృహపత్రాలు కలిగి ఉండాలని, స్వీయ రక్షణ కోసం హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్-2 ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్‌ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, సుగుణాకర్, గోదావరిఖని టుటౌన్ ఎస్‌ఐలు సనత్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఆస్తి తగాదా

● తల్లిని రోడ్డుకు ఈడ్చిన కొడుకులు



సామగ్రితో ఇంటిబయట తల్లి శకుంతల

సిరిసిల్ల టౌన్, జూలై 6: సొంత అన్నదమ్ముల ఆస్తి తగాదా తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లిని రోడ్డున పడేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన స్థానికులను కలిచివేసింది. బాధితురాలి కథనం ప్రకా రం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన యెలిగేటి శకుంతల లక్ష్మీనారాయణ దంపతులకు ముగ్గురు కొడుకులు దామోదర్, రామానుజం, చంద్రశేఖర్. అష్టకష్టాలు పడి పెంచారు. భర్త లక్ష్మీనారాయణ రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో ఉన్న ఇంటిని ముగ్గురు కొడుకులకు మూడు భాగాలు చేసి అందులోనే ఒక గదిలో శంకుతల ఒంటరిగా ఉంటోంది. ముగ్గురు కొడుకుల్లో రెండో కుమారుడు రామానుజం వ్యాపారంలో నష్టం రావడంతో ఇంటిలోని తన భాగాన్ని ఇద్దరు సోదరులకు ధర కట్టి ఇచ్చాడు. కొన్ని డబ్బులు ఇవ్వడంతో అప్పులు కట్టుకొని వేరే ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. రెండో కుమారుడు రామానుజంకు మొత్తం డబ్బులు రాకపోవడంతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయలేదు. రామానుజంకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించాలని తల్లి శకుంతలను పెద్ద కొడుకు దామోదరం, చిన్న కొడుకు చంద్రశేఖర్ ఏడు నెలల క్రితం బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో శకుంతల అక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంది. ఇటీవల శకుంతల అస్వస్థతకు గురవడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో తన సొంత ఇంట్లోనే ఉంటానని సామగ్రితో శనివారం తిరిగి వచ్చింది. ఇద్దరు కొడుకులు ఇంట్లోకి రాకుండా ఇంటికి తాళం వేయడంతో ఆ తల్లి సామగ్రితో సహా నిరీక్షించింది. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

సింగరేణిలో 272పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

● ఈ నెల 20, 21తేదీల్లో రాత పరీక్ష

గోదావరిఖని, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 10కేటగిరీలలో గల 272పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్‌ఏ), మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్సీస్ ట్రైనీ పోస్టులను ప్రత్యక్ష నియామకాల (ఎక్స్‌టర్నల్) పద్ధతిలో భర్తీ చేయడానికి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 01/2024 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20,21తేదీల్లో హైదరాబాద్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డ్/హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థుల మెయిల్ ఐడికి కూడా డౌన్లోడ్ చేసుకోవటానికి లింక్ పంపించడం జరిగిందని యాజమాన్యం తెలిపింది. పరీక్ష తేదీ, సమయం, సెంటర్ పేరు హాల్ టికెట్ నందు పోస్టులవారీగా పొందుపరిచామని జీఎం(సెక్యూరిటీ), జీఎం(పర్సనల్) వెల్ఫేర్ , ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు. పోస్టులన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ద్వారా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరూ మోస పోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ప్రలోభాలకు గురికాకుండా సింగరేణి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారని వారు తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో శనివారం కుక్క దాడిలో అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల రాజిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న కుక్క వెంబడించి గాయపరిచింది. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని ప్రజలు పేర్కొంటున్నారు. పది రోజుల కిందట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ఐదుగురు విద్యార్థులపై దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ ప్రాజెక్టులోకి 1,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 11.545 టీఎంసీల నీరు నిల్వఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.405 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.840 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

భూవివాదంలో యువకుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 6: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి(36) అనే యువకుడు శనివారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్థులు తెలిపారు. రెండేళ్ల క్రితం శ్రీకాంత్‌రెడ్డి భూమి విషయమై వివాదం ఏర్పడిందని, అప్పటి నుంచి తన భూమి తనకు దక్కుతుందో, లేదో అనే మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆత్మహత్య విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్‌ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఒకరిపై దాడి ఘటనలో ఇద్దరి అరెస్టు

చందుర్తి, జూలై 6 : ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం మండలంలోని లింగంపేట గ్రామంలో మల్యాల రవిపై జూన్ 27న ఇదే గ్రామానికి చెందిన మంద గణేష్, కట్కూరి అక్షయ్ లు బీరు సీసా, కర్రలతో దాడికి పాల్పడ్డారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి గణేష్, అక్షయ్‌లను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6: సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న చిత్తారి రత్నం(52) నోటి నుంచి నురుగులు కక్కుతుండగా శుక్రవారం రాత్రి 11 గంటలకు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. శంకరపట్నం మండలం గద్దెపాకకు చెందిన రత్నం సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటూ విద్యుత్‌స్తంభాల సబ్‌కాంట్రాక్టు పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హోటల్స్, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు



బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటల్స్ రెస్టారెంట్లు, ప్రభుత్వ, ప్రయివేటు వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో శనివారం ఆహార కల్తీ నిరోధక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. సీడ్ పాయింట్, పబ్ రెస్టారెంట్, సుప్రబాత్ రెస్టారెంట్ తదితర రెస్టారెంట్లు, హోటల్స్‌లలో శాంపిల్స్ సేకరించారు. పట్టణ శివారు ప్రాంతంలోని నూకపల్లి వద్ద కన్నయ్య డాల్ అను వ్యక్తి నిర్వహిస్తున్న బాంబే బేకరీలో తనిఖీలు చేశారు. బేకరీలో నిబంధనలకు విరుద్ధంగా రస్కు, ఫ్యామిలీ బిస్కట్, కేక్‌లను తయారీ చేస్తున్నట్లుగా గుర్తించారు. బేకరీపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష మాట్లాడుతూ పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లలో తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సేకరించామని, సంబంధిత శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్షౌరశాలలకు 250 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

గణేశ్‌నగర్,జూలై 6: క్షౌరశాలలకు గత ప్రభుత్వం 250 యూనిట్ల కరెంటు సబ్సిడీ ఇచ్చిందని దానిని కొనసాగించేలా చూడాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం టీజీ ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ కరీంగగర్ జిల్లాలో సుమారు 2500 వరకు సెలూన్ షాపులు ఉన్నాయన్నారు. నాయీ బ్రాహ్మణ సెలూన్లకు, రజకులకు కూడా గత ప్రభుత్వం మాదిరిగానే సబ్సిడీ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కరెంటు సిబ్బంది సెలూన్ల బిల్లు కట్టాలని లేకుంటే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది నాయీబ్రాహ్మణులను, రజకులను విద్యుత్ బిల్లులు చెల్లించాలని వేధించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ,జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయి,నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ నాయీ, సంఘం సభ్యులు తదితారులు పాల్గోన్నారు.

రైస్‌మిల్లుపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

శంకరపట్నం, జూలై 6: శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులో గల రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లకు సంబంధించిన 3.24లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తనిఖీ చేశారు. 673 క్వింటాళ్ల ధాన్యం తక్కుగా ఉన్నట్లు గుర్తించారు. నెల రోజులలో 673 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించి, వారి వద్ద నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష్మారెడ్డి, జగిత్యాల డీఎం ఆర్తిరామ్, నయాబ్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఎస్‌ఐ సుధాకర్, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ శ్రీనునాయక్, డీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూలై 6: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో జిల్లా అడిషనల్ జడ్జి పూజలు

నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ జడ్జికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించి ఆయనను సత్కరించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ఆలయ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు అశ్విన్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

కళాభారతి.. ఏమిటీ పరిస్థితి

● శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కళాభారతి పక్కన చెత్తా చెదారం



అసంపూర్తిగా మినీ ఆడిటోరియం

కరీంనగర్ కల్చరల్, జూలై 6: ఘన చరిత్ర ఉన్న కళాభారతి నేడు అధ్వాన స్థితికి చేరింది. ఊడిన పై కప్పు పెచ్చులు... విరిగిన కుర్చీలు.. కుంగిన వేదిక.. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా మారింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి కరీంనగర్ వచ్చినప్పుడు అన్ని హంగులతో కలెక్టరేట్ హెలీప్యాడ్ ఆవరణలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.15 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలయ్యింది. టెండర్లకు ఆహ్వానించకపోవడంతో అటు పాత కళాభారతికి మోక్షం దక్కక, కొత్త ఆడిటోరియం నిర్మాణ పనులు మొదలుకాలేదు. 2005లో ఎస్సారార్ కళాశాల ఆవరణలో కళాభారతికి ప్రత్యామ్నాయంగా నిర్మించతలపెట్టిన మినీ రవీంద్రభారతి కలగానే మిగిలిపోయింది.

● ఇదీ చరిత్ర...

1974లో కళాభారతిని నిర్మించారు. అప్పుడు టౌన్‌హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కేఎస్ శర్మ కళాభారతి అని పేరు పెట్టారు. అనంతరం వెనుక భాగంలో ఆడిటోరియం నిర్మించారు. 2005లో మినీ రవీంద్ర భారతిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సెంట్రల్ స్కీం కింద రెండు కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడత 25 లక్షలు ఇవ్వగానే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. తర్వాత నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ మంచి కళాక్షేత్రం కోసం అప్పటి సీఎంతో మాట్లాడుతామని అన్నారు. అది సాకారం కాలేదు. క్రమక్రమంగా కళాభారతి శిథిలావస్థకు చేరుకుంది.



కరీంనగర్‌లోని కళాభారతి



నిరుపయోగంగా మారిన కళాభారతి

చెట్లు నరికిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని వేంపేట శివారులో గుర్తు తెలియని రైతులు విచక్షణారహితంగా చెట్లను నరికివేయడంతో మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులో ఉపాధిహామీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన 150 చెట్లను ఈనెల 1న గుర్తు తెలియని రైతులు నరికివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెట్లు విచక్షణారహితంగా నరికివేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. చెట్లు నరికిన విషయంపై సాకులు చెప్పి దాటవేయడం మంచి పద్ధతి కాదని, ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని సూచించి చెట్లు నరికి వేసిన వారిపై ఫిర్యాదు చేయాలని హెచ్చరించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



లవంగ భావన

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో లవంగ భావన అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మరిపెల్లి కార్తీక్ శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్ 12లో 100 మీటర్ల పరుగు పందెంలో భావన ప్రథమ బహుమతి గెలుపొంది మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు మొదటి స్థానంలో నిలిచిన లవంగ భావనను ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన భావనను ప్రధానోపాధ్యాయుడు జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు. పాఠశాల పేరు నిలపాలని భావనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా ఉండాలి

● గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 6 : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరముందని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి ఒక మాసం వేతనం ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బదిలీపై వెళ్లిన అధికారులను యథాస్థానానికి బదిలీ చేయాలని, సమాన నిష్పత్తి చందాతో ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ కాలయాపన జరుగుతున్నందున అయిదు శాతం ఐఆర్‌ను ఇరవై శాతానికి పెంచాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కందుకూరి రవి బాబు, గణేష్, బద్దం రాజేందర్ రెడ్డి, అత్తినేని శ్రీనివాస్, సలీం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ అంజిత్ రెడ్డి, విజేందర్, ఎ. శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 7 రోజులు, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 33,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు పాటించి వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు.

కూలిన కాకతీయ కాల్వ రక్షణ గోడలు

● మరమ్మతులు చేపట్టని అధికారులు
● భయాందోళనలో వాహనదారులు



పోచంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కూలిన కాలువ రక్షణ గోడ

మానకొండూర్, జూలై 6: కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టం లేదు. దీంతో వాహనదారులు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట 45 కిలోమీటర్లు నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజూ కరీంనగర్ నుంచి జమ్మికుంటకు, ఊటూర్‌కు ప్రతి అరగంటకు ఒక్క బస్సు చొప్పున ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా డీబీఎం-6 ప్రధాన కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో కాల్వ వంతెనపై ఇసుక లారీ వెళ్తున్న సమయంలో వంతెన కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. రాత్రి వేళల్లో వంతెన మీదుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాల్వలో పడిపోతామోనని భయాందోళనలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణవేణి పాఠశాలలో అల్ఫాబెటిక్ డే

కోల్‌సిటీటౌన్, జూలై 6: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం అల్ఫాబెటిక్ డే వేడుక ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

ధర్మారం, జూలై 6:ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులను శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా రూప్లానాయక్ తోపాటు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఓదెల, జూలై 6 : మండల కేంద్రానికి చెందిన మృతుడు దేవరకొండ రామ్మూర్తి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. శుక్రవారం రాత్రి రామ్మూర్తి గుండెపోటుతో మృతి చెందడంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతడి నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. కుటుంబ సభ్యులను ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు. జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు మేర్గు భీష్మచారితోపాటు లింగమూర్తి, వాసు, సారంగం, అల్లం సతీష్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, మధుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అనధికార డిప్యూటేషన్లను రద్దు చేయాలి

మంథని, జూలై 6: వర్క్‌అడ్జస్ట్ పేరిట జరుగుతున్న అనధికార డిప్యూటేషన్లను రద్దు చేయాలని, ఈవిధాన్ని తాము ఖండిస్తున్నామని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి వర్క్ అడ్జస్ట్మెంట్ విధానాన్ని విరమించుకొని ఇటు ఉపాధ్యాయులకు, అటు విద్యార్థులకు మేలు కలిగే నిర్ణయాలు తీసుకొని విద్యావ్యవస్థ ఉన్నతికి కృషిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేయండి

కోల్‌సిటీ, జూలై 6: రామగుండం నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల్లో ప్రక్షాళన చేయాలని, ముఖ్యంగా పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరారు. శనివారం రామగుండంకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందించారు. 50 డివిజన్లకు ఒక జేసీబీ, ఒక బ్లేడ్ ట్రాక్టర్ ఉండడం వల్ల పనులు జరగడం లేదని, ముళ్లపొదలు, తుప్పలు పెరిగి పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. డివిజన్‌కు కేటాయించిన ట్రాక్టర్ సెల్ఫ్ కూడా లేని పరిస్థితి ఉందన్నారు. డివిజన్‌లో డ్రైన్ నిర్మాణానికి సంబంధించి మంచినీటి పైప్‌లైన్లు, విద్యుత్ స్తంభాలు షిఫ్టు చేయడం పేర ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టారన్నారు. కార్పొరేషన్‌లోని శానిటేషన్, వీధిదీపాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కమిషరేట్‌లోని సీఐలు, ఎస్‌ఐలకు స్థానచలనం

కోల్‌సిటీ, జూలై 6: రామగుండం కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలు, 14మంది ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు ఐజీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీచేశారు. మంచిర్యాల ట్రాఫిక్ సీఐ కే నరేష్‌ను శ్రీరాంపూర్ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న బొంతల సత్యనారాయణను ట్రాఫిక్ సీఐగా నియమించారు. రామగుండం కమిషనరేట్‌కు అటాచ్డ్‌లో ఉన్న కే జగదీష్‌ను కమిషనరేట్ ఎస్‌బీకి బదిలీ చేశారు. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్‌ను కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల జిల్లా సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సంజయ్‌ని కమిషనరేట్ వీఆర్‌కు పంపారు. వెయింటింగ్‌లో ఉన్న జీ సదన్ కుమార్‌కు మానకొండూరు సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఎస్‌ఐలు మహేందర్, సుబ్బారావు, ప్రశాంత్‌లను బదిలీ చేశారు. మహేందర్‌ను ఎస్‌ఐ-2 రామకృష్ణాపూర్‌గా, సుబ్బారావును చెన్నూర్ ఎస్‌ఐ-2గా, ప్రశాంత్‌ను బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌ఐగా బదిలీచేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌ఐ సురేష్‌ను మంచిర్యాల టౌన్ ఎస్‌ఐ-1గా నియమించారు. కమిషనరేట్ వీఆర్‌లో ఉన్న బీ వినితకు మంచిర్యాల ఎస్‌ఐ-2గా, గోదావరిఖని టుటౌన్‌లో పనిచేస్తున్న సతన్ కుమార్‌ను ఎస్‌ఐ-3గా నియమించారు. గోదావరిఖని వన్‌టౌన్‌లో ఎస్‌ఐ-3 సుగుణాకర్‌ను నస్పూర్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రవికుమార్‌ను వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న ఉదయ్‌కిరణ్‌ను దండేపల్లి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న స్వరూప్‌రాజ్‌ను వీఆర్‌కు పంపారు. మంచిర్యాల సీసీఎస్ ఎస్‌ఐ-2 పీ సతీష్‌ను లక్సెట్టిపేట ఎస్‌ఐగా బదిలీ చేశారు. లక్సెట్టిపేట ఎస్‌హెచ్‌ఓ చంద్రకుమార్, చెన్నూర్ ఎస్‌ఐ-2 వెంకటేశ్వర్‌రావు, ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌బీ ఎస్‌ఐ రామకృష్ణలను కమిషరేట్ వీఆర్‌కు పంపారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి..




జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మంథనిలో..

కళ్యాణ్‌నగర్, జూలై 6: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ అనీల్ కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, నాయకులు బొంకూరి మధు, కొంకటి లక్ష్మణ్, తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, దాసరి ఎల్లయ్య, మైస రాజేష్, కాంపల్లి సతీష్ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాళులర్పించారు. తోడేటి శంకర్‌గౌడ్, అచ్చేవేణు, మెతుకు దేవరాజ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, పిల్లి రమేష్, సీహెచ్ మొగిలి, ఇరుగురాళ్ల శ్రావణ్, మారుతి పాల్గొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎలిగేడు : మండలంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని పార్టీలకతీతంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీవైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, ఎలిగేడు ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సింగిరెడ్డి రాంచందర్‌రెడ్డి, ముత్యాలు, శంకర్, పోచయ్య, బాపయ్య, చంద్రయ్య, కొండయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంథని : బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్, స్థానిక ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, బత్తుల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్‌లు వేర్వేరుగా పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూలై 6: పెద్దపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ పరిధిలో పెండింగ్ ఉన్న రేషన్ షాపులకు బియ్యాన్ని త్వరగా సరఫరా చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం బస్టాండ్ సమీపంలో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద కలెక్టర్ స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, గూడ్స్ రిజిస్టర్ రికార్డులను, ఆన్‌లైన్ రికార్డులను, వెయింగ్ యంత్రాల రిసిప్ట్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే విధానాన్ని కలెక్టర్ ఆరా తీశారు. పెద్దపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్ పరిధిలో పెద్దపల్లి, రామగుండం, ధర్మారం, పాలకుర్తి, అంతర్గం మండలాల్లోని 195 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, జూలై మాసానికి సంబంధించి ఇప్పటివరకు 170 షాపులకు సరఫరా పూర్తి చేశామని అధికారులు తెలిపారు. స్టేజ్ 2 తుది కాంట్రాక్టర్ ఫైనలైన నేపథ్యంలో పెండింగ్ ఉన్న షాపులకు సైతం త్వరగా బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ బీ రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులున్నారు.



ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

రేషన్ బియ్యాన్ని సక్రమంగా సరఫరా చేయాలి

మంథని, జూలై 6 : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ప్రజలకు సక్రమంగా సరఫరా చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సూచించారు. మండలంలోని పలు రేషన్ షాపులను ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బందితో కలిసి పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుపల్లిలో రేషన్ షాప్ నంబర్ 29ని తనిఖీ చేయగా 3.60 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా, గుమ్మనూరు గ్రామంలో రేషన్ షాప్ నంబర్ 5ని తనిఖీ చేయగా 10 క్వింటాలు తక్కువగా గుర్తించామని, సదరు రేషన్ డీలర్ మీద కేసు నమోదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఫోర్సుమెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లి రోడ్డుకు మహర్దశ

- డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్ల మంజూరు.. త్వరలో పనులకు శ్రీకారం



డబుల్ రోడ్డుగా మారనున్న కాల్వశ్రీరాంపూర్-పొత్కపల్లి రోడ్డు

కాల్వశ్రీరాంపూర్, జూలై 6: మండల కేంద్రం నుంచి పొత్కపల్లి వెళ్లేందుకు ప్రభుత్వం నుంచి సీఆర్‌ఎఫ్ నిధుల కింద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. కొన్ని సంవత్సరాలుగా కాల్వశ్రీరాంపూర్ పొత్కపల్లి రహదారి అధ్వానంగా మారింది. మండల కేంద్రం నుంచి పొత్కపల్లి ద్వారా జమ్మికుంట వరకు బస్సులు నడుస్తున్నాయి. అదేవిధంగా పొత్కపల్లి, ఓదెల రైల్వేస్టేషన్ వెళ్లేందుకు రహదారి బాగా లేని కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానం వెళ్లేందుకు కూడా ఈ రహదారి ఉపయోగపడుతుంది. రహదారి బాగాలేని కారణంగా గంగారం, పెగడపల్లి, నాంసాంపల్లి ద్వారా ఓదెల దేవస్థానానికి వెళ్లవలసి వస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. పెద్దకామిరే, పందిళ్ల, మల్లయ్యపల్లె గ్రామస్తులు రహదారి బాగాలేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి గతంలోని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా రహదారి పనులు జరుగలేదు. ప్రస్తుతం ఈ రహదారికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.25కోట్లు మంజూరు చేశారని, త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పాత తహసీల్దార్ కార్యాలయం..

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం..

ఎలిగేడు, జూలై 6 : మండల కేంద్రంలో లక్షలాది రూపాయలు ఐఆర్‌డీఎఫ్ నిధులతో 2006లో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల అదనపు తరగతి గదులను నిర్మించారు. నిర్మించిన నూతన భవనం ఖాళీగా ఉండ డంతో కొంతకాలం తహసీల్దార్ కార్యాలయంగా కొనసాగింది. నూతన భవన నిర్మాణం పూర్తి కావడంతో తహసీల్దార్ కార్యాలయం మూడేళ్ల క్రితం అందులోకి మార్చబడింది. దీంతో పాత భవనంలోని జనరేటర్, సామగ్రి చోరీకి గురైంది. భవనంలోని తలుపులు, కిటికీలను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం భవనం ఖాళీగా ఉండడంతో గంజాయి సేవించే వారికి, మందుబాబులకు అడ్డాగా మారింది. మరోవైపు మండలంలో పోలీస్ స్టేషన్ లేకపోవడం కారణంగా అసాంఘిక కార్యకలాపాలు మితిమీరిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం



భూగర్భ జలాలను కాపాడుకోవాలి : జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని, జూలై 6: భూగర్భ జలాలను కాపాడుకోవాలని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇల్లందు క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వ భూగర్భ జలవనరుల శాఖ, నేషనల్ హైడ్రాలాజీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు అంతరించి పోకుండా బోర్‌వెల్స్ విశ్లేషణ, నీటి సాంద్రత, పరీక్షలు నిర్వహించడం, అక్విఫెయిర్ పారామీటర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూగర్భ జలవనరుల శాఖ ఇక్కడ శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. మొగల్ పహాడ్ గ్రామంలో భూగర్భ జలవనరుల పరీక్షలు నిర్వహించి నీటి లభ్యత, సాంద్రత పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు చెప్పారు. ఎన్‌హెచ్‌పీ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ తెలంగాణ భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 12జిల్లాల నుంచి భూగర్భ జల వనరులశాఖ ఉన్నతాధికారులు, శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని, సింగరేణి యాజమాన్యం ఎంత నీటిని తీసుకుని తిరిగి ఎంత నీటి లభ్యత వస్తున్నదనే విషయాన్ని ఈ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. నీటి సమస్య ఉంటే గుర్తించవచ్చునన్నారు. ఈ పరీక్షలు చాలా ముఖ్యమని ఆయన చెప్పారు. ఈ శిక్షణ తరగతుల్లో నేషనల్ హైడ్రాలజిస్ట్ అధికారులు వేణు, ఆంజనేయప్రసాద్, పైడి రాజు, పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశం

గోదావరిఖని, జూలై 6: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) కోర్ కమిటీ సమావేశం ఎన్‌టీపీసీలోని లక్ష్మీనర్సింహా గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావవేశంలో బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు, ఈ సమావేశానికి కోర్ కమిటీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బొగ్గు బ్లాకుల వేలం ఆపేదాకా పోరాటం

- సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నంలో కేంద్ర, రాష్ట్రాలు - ధర్నాలో రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్



ఆర్జీ-1 జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆర్జీ-3 జీఎంకు వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని, జూలై 6: సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియను ఆపేదాక పోరాటాలు కొనసాగిస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ముందు బొగ్గు బ్లాకుల వేలం పాటలను వ్యతిరేకిస్తూ భారీ ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా చందర్ హాజరయ్యారు. అనంతరం ఆర్‌జీ-1 జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, కేంద్ర నాయకులు నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, పర్లపరల్లి రవి, వెంకటేష్, గుండు శ్రావణ్, చెలుకలపెల్లి శ్రీనివాస్, పొలాడి శ్రీనివాస్‌రావు. శేషగిరి, జోసఫ్, బీఆర్‌ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, తోకల రమేష్, తిమోతి, శ్రావన్, సాయి కుమార్, కిరణ్, జీ కనుకయ్య, ఉప్పులేటి తిరుపతి, వాసర్ల తిరుపతి పాల్గొన్నారు

ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట..

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 6: తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని వ్యతి రేకిస్తూ శనివారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట టీబీజీకేఎస్ శ్రేణులు ధర్నా చేశాయి. ప్రభాకర్‌రెడ్డి, మాదాసు రామ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సురేందర్, బేతి రవితేజ, మార్క నరేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట..

రామగిరి, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల వేలం రద్దు చేయాలని డిమాండ్ చేస్తు శనివారం టీబీజీకేఎస్ నాయకులు ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. నాగెల్లి సాంబయ్య, పింగిళి సంపత్‌రెడ్డి, దాసరి మల్లేష్, జిటుకు శ్రీనివాస్, అల్లంతిరుపతి, వీవీ గౌడ్, కేశవరావు, గండి శ్రీనివాస్, క్రాంతి యాదవ్, కొప్పుల సురేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కుట్రపూరిత చర్యలను మానుకోవాలి : టీఎన్‌టీయూసీ

గోదావరిఖని, జూలై 6: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఎల్లోకార్డు, రెడ్ కార్డు పేరుతో కార్మిక వర్గంపై యాజమాన్యం కుట్రపూరితమైన చర్యలకు పాల్పడటం మానసిక దాడులు చేయడమేనని, ఇలాంటి చర్యలను మానుకోవాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎన్‌టీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక రకాల సంస్కరణలతో సింగరేణి సంస్థలో కార్మికులను యాజమాన్యం తగ్గిస్తుందని, కాంట్రాక్టు కార్మికులను పెంచుతుందన్నారు. నూతన బొగ్గుగనులు ఏర్పాటు చేయకుండా ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యంగా యాజమాన్యం కార్మికులపై భారం పెంచుతూ అనేక కుట్రలకు పాల్పడుతుందన్నారు. కార్మికుల పని తీరును పట్టి ఎల్లో, రెడ్ కార్డుల పేరుతో కార్మికులను విభజిస్తూ ప్రమాదాలు జరిగినపుడు కార్మికులన బాధ్యులుగా చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎన్‌టీయూసీ నాయకులు మునిగంటి దామోదర్‌రెడ్డి, సల్ల రవీందర్, చిటికెల రాజలింగు, రాజనర్సు, స్వరాజ్యం, బరిగెల కళావతి, అశ్విని, పాత నరసింహారావు, కొండి శ్రీను, రాజేశ్వరి, సుందిళ్ల స్వామి పాల్గొన్నారు.

ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్

కోల్‌సిటీటౌన్, జూలై 6: గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం ఎప్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. సుమారు 400 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాగా అధికారులు పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు సంబంధిత లాగిన్ ఐడి ద్వారా ఈనెల 15వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.సురేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్ సూచించారు. కార్యక్రమంలో పరిశీలన అధికారులు డాక్టర్ రవి, రమేష్, ప్రసాద్, అజయ్‌కుమార్, యాదయ్య, సావిత్రి పాల్గొన్నారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అవగాహన సదస్సు

సుల్తానాబాద్, జూలై 6: ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల దినాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు జంతు సంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో పనిచేస్తున్న మహమ్మద్ నవాబ్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

'బాధితురాలికి న్యాయం చేయాలి'

పెద్దపల్లిటౌన్, జూలై 6: ఎన్నికల సమయంలో ప్రచార రథం ఢీకొని చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న బాధితురాలికి న్యాయం చేయాలని, ఆమె దుస్థితికి కారణమైన దాసరి ఉష, ఆమె తండ్రి హన్మయ్యపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 20న పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష ప్రచార రథం ఢీకొని గ్రామానికి చెందిన జిల్లాల అంజమ్మ తీవ్రంగా గాయపడిందన్నారు. అప్పట్లో బాధితురాలికి పూర్తి వైద్య ఖర్చులు, కోలుకునే వరకు తామే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చిన ఉష, హన్మయ్య అప్పుడు వైద్యం చేయించారని తెలిపారు. వైద్యం పూర్తి స్థాయిలో అందక తిరిగి బాధితురాలికి ఆపరేషన్ అవసరం ఏర్పడిందని, బాధితురాలికి దాసరి ఉష వైద్యం పూర్తి స్థాయిలో చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కండె కరుణాకర్, ఈదునూరి చంద్రయ్య, ఆనంద్, దేవయ్య, నందయ్య, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం

కమాన్‌పూర్, జూలై 6: ప్రపంచ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహకార దినోత్సవ ప్రత్యేకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిందం తిరుపతి, సభ్యులు గుండేటి శ్రీమూర్తి, అడ్వాల చంద్రయ్య, వైనాల రాజు, సీఈవో తిమమరాజు, సంతోష్ తదితరులు ఉన్నారు.

●సుల్తానాబాద్: సహకార సంఘాల ద్వారానే మెరుగైన భవిష్య త్తును నిర్మించుకోవచ్చని కేడీసీసీబీ డైరెక్టర్లు మోహన్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల, సుల్తానాబాద్ పట్టణంలోని సహకార సంఘాలలో శనివారం సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా సంఘాలలో నిర్వహించిన సహకార జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో సీఈఓలు వల్లంకొండ రమేష్, బూరుగు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

●మంథని: సహకార సంఘాల ద్వారానే మెరుగైన భవిష్యత్ నిర్మించవచ్చని మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో శనివారం సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, లెక్కల కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, దేవళ్ల విజయ్ కుమార్, దాసరి లక్ష్మీమొండయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీంఖాన్, నాయకులు మంథని విజయ్ కుమార్, బెజ్జంకి డిగంబర్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు.

'ర్యాగింగ్ మానవ హక్కుల ఉల్లంఘనే'



మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

రామగిరి, జూలై 6: ర్యాగింగ్ మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పెద్దపల్లి జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సెంటినరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలో ప్రివెన్షన్ ఆఫ్ ర్యాగింగ్‌పై లీగల్ అవగాహన క్యాంప్‌కు జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా విద్యార్థులచే జిల్లా జడ్జి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే హక్కు లేదు'

కమాన్‌పూర్, జూలై 6 : మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే హక్కు పుట్ట మధుకు లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ మల్యాల రాంచందర్‌గౌడ్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కూలిన ఓడేడు బ్రిడ్జీపై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో నాయకులు చొప్పరి శేఖర్, బాద్రపు శంకర్, చిగురుమొండయ్య, కుశన రవి, కుక్క రవి, కొంతం శ్రీనివాస్, భూస తిరుపతి, కోల నరేందర్ తదితరులు ఉన్నారు.

'నిజాలు తెలుసుకొని మాట్లాడాలి'

మంథని, జూలై 6: ఓడేడు మానేరు నదిపై బ్రిడ్జి కూలిన విషయంపైన నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముత్తారం మండలం, ఓడేడు వద్ద మానేరు నదిపై గత ప్రభుత్వం అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి కొంత కాలంగా కూలిపోవడం జరిగిందన్నారు. దీనికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వమే అన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న శ్రీధర్‌బాబు బీఆర్‌ఎస్ అవినీతిపై ప్రశ్నిస్తే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

చిన్నకల్వలలో మట్టి అక్రమ రవాణా

- అడ్డుకున్న బీఆర్‌ఎస్ నాయకులు

సుల్తానాబాద్, జూలై 6: మండలంలోని చిన్నకలువల గ్రామంలో మట్టి అక్రమ రవాణాను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో మాజీ సర్పంచ్ చేపట్టే కాంట్రాక్టు పనుల కోసం అక్రమంగా మట్టిని తరలిస్తున్నాడని, ఇందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను, సిబ్బందిని వినియోగిస్తున్నాడని బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. మట్టి తరలింపులో గిరిజనులను సైతం ఇబ్బందుల పాలు చేస్తు న్నాడని ఈ విషయం తమకు తెలియగానే గ్రామానికి చేరుకుని మట్టి తరలింపును అడ్డుకున్నానని తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంట తాజా మాజీ ఎంపీటీసీ గుర్రం సంపత్ ఉన్నారు.